# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గడిచిన 10 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 9 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**
2. **గడిచిన 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 11 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.**
3. **జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు గత ఏడాది 100 కోట్ల రూపాయల ప్రోత్సాహకం విడుదల చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.**
4. **తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఈ రోజు మధ్యాహ్నం నూతన మంత్రుల ప్రమాణ స్వీకారం జరగనుంది.**
5. **చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ పునఃప్రారంభించిన వారం రోజుల్లోనే కోటికి పైగా కుటుంబాలకు నిత్యావసరాలను అందించామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

==========================

టైక్స్ టైల్స్ రంగంలో ప్రపంచ శ్రేణి దిగ్గజ కంపెనీ కిటెక్స్ గార్మెంట్స్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కేరళ రాష్ట్రం కొచ్చిలో ఉన్న కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి నిన్న సందర్శించారు. అక్కడ తయారవుతున్న దుస్తులను పరిశీలించిన అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ కేవలం పది నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు 9 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెట్టు బడులకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్, నీటి సౌకర్యం సహా అన్ని మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత వివరిస్తూ...

...వాయిస్..35 సెకన్లు

--------------------------

గడిచిన 11 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 11 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సామాజిక మాధ్యమ కార్యకర్తల కార్యశాల నిన్న జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నీతి, నిజాయతీతో సమర్థ పాలన అందిస్తూ.. అన్ని రంగాల్లో ఊహించని విజయాలను దేశానికి అందించారని తెలిపారు. ఆయా అంశాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

---------------------------

గడిచిన ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా 30కి పైగా పథకాల అమలు, వాటి ఫలితాల ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు 100 కోట్ల రూపాయల ప్రోత్సాహకం విడుదల చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న నేపథ్యంలో నిన్న విజయవాడలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల సేవల్లో వృద్ధి నమోదైందని మంత్రి సత్యకుమార్ వివరిస్తూ..

..వాయిస్..35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీని పునఃప్రారంభించిన వారం రోజుల్లోనే కోటికి పైగా కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్ర ప్రజా పంపిణీ చరిత్రలో ఇది గొప్ప మైలురాయి అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న కోటీ 46 లక్షల 21 వేల 232 మంది కార్డుదారులకు ఈ నెల ఒకటవ తేదీ నుంచి 29 వేల 796 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభించామని మనోహర్ వెల్లడించారు. ఏడు రోజుల్లోనే కోటీ 5 లక్షల 27 వేల 767 మంది కార్డుదారులు.. అంటే 72 శాతం కుటుంబాలు సరుకులు తీసుకున్నాయని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు దక్కనుంది. ఈ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 12 గంటల 20 నిమిషాల మధ్య నూతన మంత్రుల ప్రమాణస్వీకారం జరగనుంది. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుక బడిన వర్గాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.

---------------------------

కృష్ణా జిల్లా మచిలీపట్నం అభివృద్ధికి తమ శాఖ ద్వారా అన్ని విధాలా సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారు. మంగినపూడి తీరంలో నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్‌లో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. పర్యాటకంగా బందరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బీచ్ ఫెస్టివల్ ఇంత ఘనంగా చేస్తారని తాను ఎప్పుడూ ఊహించ లేదని కార్యక్రమంలో పాల్గొన్న మరో మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. సుందర స్వప్నానికి మసులా ఫెస్ట్‌తో తొలి అడుగు పడిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సముద్ర పర్యాటకం

కోసం గోవా, శ్రీలంక వంటి ప్రాంతాలకు వెళ్తున్న వారికి  ఆంధ్రప్రదేశ్ తీరాన్ని ప్రత్యామ్నాయంగా మారుస్తామని ఆయన  తెలియజేస్తూ..

... వాయిస్..32 సెకన్లు

---------------------------

ఈ రోజు సముద్ర పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూ వాతావరణం... సమతుల్య స్థితిలో ఉండేందుకు సముద్రాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. సముద్రాలు లేని పక్షంలో మానవుని మనుగడ దుర్భరమవుతుంది. అన్నిటికంటే ముఖ్యమైనది వర్షాలు, రుతుపవనాల ఆగమనం సముద్రాల వల్లనే సాఫీగా జరుగుతుంది. తుపానులు, గాలుల రాకలో సముద్రాలే కీలక భూమిక పోషిస్తాయి. అంతేకాదు.. లక్షలాది జీవ రాశులకు సముద్రాలు నిలయంగా వున్నాయి. ఈ జీవరాశులు కూడా పర్యావరణ సమతుల్యానికి దోహదం చేస్తున్నాయి. ఇంత ప్రాముఖ్యం వున్న సముద్రాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ఈరోజు సముద్ర పరిరక్షణా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

రుతుపవనాల మందగమనం, బంగాళాఖాతంలో అల్పపీడనాలు లేకపోవడంతో కోస్తాంధ్రలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. నిన్న కొన్నిచోట్ల వడగాడ్పులు వీచాయి. వరుసగా నాలుగోరోజు కోస్తాలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో 41.1, కృష్ణాజిల్లా గన్నవరంలో 41, నెల్లూరులో 40.8, గుంటూరు జిల్లా అమరావతిలో 40.7, బాపట్లలో 40.5, ఒంగోలులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో ఈ రోజు ఉక్కబోతతో పాటు40-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తాలో ఎండ వేడి కొనసాగుతుందని, కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులో వర్షాలు కురుస్తాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ప్రకాశం, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది.

---------------------------

ఉబ్బస రోగులకు ఏటా ఉచితంగా సరఫరా చేసే చేప ప్రసాదం పంపిణీకి హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ రోజు, రేపు జరిగే పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ సారి పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పీజీ సెట్-2025 పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. సెట్ ఛైర్మన్ అప్పారావు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు పరీక్షల వివరాలను నిన్న తిరుపతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని 30 కేంద్రాల్లో రేపటి నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫలితాలను ఈ నెల 25వ తేదీ లోపు ప్రకటిస్తామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ప్రజల అభిప్రాయాలు, అవగాహనను మదింపు చేసేందుకు జనాభా నిర్వహణ విధానం పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ ప్రక్రియ 20వ తేదీ వరకు కొనసాగనుంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ సచివాలయ ఉద్యోగులు ఫోన్ చేసి ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నలు అడుగుతారు. అందుబాటులో ఉన్న ఐచ్ఛికాల రూపంలో లేదా సొంతంగా ఏమైనా చెప్పాలనుకున్నా వారికి అభిప్రాయాలను వివరించవచ్చు. ఎవరికి వారు స్వచ్ఛందంగా ఆలోచనలు పంచుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌నూ ప్రభుత్వం విడుదల చేసింది.

======================